సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 10 । అక్టోబర్ । 2024



17న శబరికి స్మృత్యంజలి..
శ్రీరాముడి భక్తురాలైన శబరిని స్మరిస్తూ ఈనెల 17న స్మృతియాత్ర నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 12లో



పూలు.. ఔషధ గుణాలు !
మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో ఉపయోగించే ప్రతీ పువ్వులో ఔషధ గుణాలు ఉన్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

15న సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీ

కొత్తగూడెంటౌన్: సీఎం కప్ పోటీల్లో భాగంగా ఈనెల 3న హైదరాబాద్‌లో బయలుదేరిన టార్చ్ ర్యాలీ 15వ తేదీన కొత్తగూడెం చేరుకుంటుందని, లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్కు నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు కొనసాగుతుందని డీవైఎస్‌ఓ ఎం.పరంధామారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

పంట పొలాల్లోకి నెమలి



అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న నెమలి

చంద్రుగొండ : తన అందాలతో కనువిందు చేసే జాతీయ పక్షి నెమలి.. మండలంలోని గుర్రాయిగూడెం గ్రామ శివారులో గల పంట పొలాల మధ్య చిక్కుకుపోయింది. పొలాల్లో కీటకాలను తినే క్రమంలో ఇటీవల పురుగుల మందు పిచికారీ చేసిన పంటను కూడా తినడంతో మందు ప్రభావానికి సొమ్మసిల్లి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన రైతులు నెమలిని బుధవారం గ్రామంలోకి తీసుకొచ్చి అటవీ అధికారులకు సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్ జాన్‌ప్రదీప్, బేస్‌క్యాంప్ సిబ్బంది దుర్గాప్రసాద్ ఆ నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన ‘ఓపెన్’ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న ఓపెన్ పది, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ఇంటర్ ఒకేషనల్ గ్రూప్‌లోని కంప్యూటర్ సైన్స్ పరీక్షకు ఒకే అభ్యర్థి ఉండగా అతడు హాజరయ్యాడని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన వివిధ శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పంట నష్టపరిహారం రూ. 2.65 కోట్లు

ఎకరానికి రూ.10 వేల చొప్పున విడుదల

పాల్వంచరూరల్ : గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట తదితర మండలాల పరిధిలో 2,146 మంది రైతులకు చెందిన 2,656.15 ఎకరాల్లో వరి, పత్తి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. అధికారులు సర్వే చేసి, నష్టం నివేదికలను ఉన్నతాధికారులకు అందించగా ఎకరానికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లాకు రూ.2,65,63,750 రాగా, రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు తెలిపారు.

బొగ్గు గనుల్లో ముందస్తు విందు

దసరా సందర్భంగా రేపు ఏర్పాటు చేయనున్న సింగరేణి

- కార్మికులతో నేరుగా యాజమాన్యం మాటామంతీ
- భవిష్యత్ ప్రణాళికలు, కార్మికుల సందేహాల నివృత్తి
- బొగ్గు బ్లాకుల వేలంపై చర్చ జరిగేనా..?



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో ఒకప్పుడు దసరా అంటే జల్సాలతో గనులు కళకళలాడేవి. కార్మికులు స్వచ్ఛందంగా గనుల దగ్గర సంబరాలు చేసుకునేవారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సందడి తగ్గింది. అయితే ఇప్పుడు యాజమాన్యమే స్వయంగా కార్మికులకు విందు ఇవ్వాలని నిర్ణయించడం ఈ దసరా విశేషం.

అమ్మవార్లకు మొక్కులతో..

50 ఏళ్ల క్రితం భూగర్భ గనుల్లో బొగ్గు తవ్వకాలు ఎంతో ప్రమాదంతో కూడుకుని ఉండేవి. దీంతో తమకెలాంటి ప్రమాదం జరగకుండా చూడాలంటూ గనుల్లోకి దిగే ముందు, బయటకు వచ్చిన తర్వాత గని ప్రదేశంలో వేప, రావి చెట్ల మొదళ్ల దగ్గరున్న పెద్దమ్మ, పోచమ్మ, ఉప్పలమ్మ, మైసమ్మ తదితర గ్రామదేవతలకు కార్మికులు దండం పెట్టుకునేవారు. ఏడాది పొడవునా తమను కాపాడిన దేవతలకు కృతజ్ఞతాపూర్వకంగా దసరా సమయంలో ‘మొక్కులు’ చెల్లించుకునే వారు. గనుల్లో గ్యాంగుల వారీగా వాటాలు వేసుకుని మేక/గొర్రెలను మొక్కులు చెల్లించి, అక్కడే మాంసాన్ని పోగులు వేసుకుని, వంట చేసుకుని ‘జల్సా’ చేసుకునేవారు. దీంతో దసరా సమయంలో సింగరేణి గనుల దగ్గర సందడి వాతావరణం నెలకొని ఉండేది. అయితే రానురాను సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గిపోవడం, మరోవైపు ‘జల్సా’ల సమయంలో కొన్ని అవాంఛనీయ ఘటనలు జరగడం తదితర కారణాలతో క్రమంగా ఈ సంస్కృతి తగ్గిపోయింది.

సంస్థ బహుముఖ విస్తరణ..

పదేళ్ల క్రితం వరకు సింగరేణికి బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థగానే పేరు. కానీ ఇప్పుడు థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్‌లో దూసుకుపోతోంది. తెలంగాణ ఆవల ఒడిశాలోనూ బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. రాజస్థాన్‌లో సోలార్ పవర్‌కు ప్రణాళిక సిద్ధమవుతోంది. లిథియం మైనింగ్‌పై దృష్టి పెట్టింది. గ్రీన్ ఎనర్జీలో ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తోంది. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్, జియో థర్మల్ పవర్ ప్లాంట్ వంటి ప్రయోగాలకు సిద్ధమవుతోంది. వీటితో పాటు భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపైనా దృష్టి సారించింది. కార్మికులు కచ్చితంగా ఎనిమిది గంటల పాటు విధుల్లో ఉండేలా కట్టుదిట్టం చేస్తోంది. ఇలా ఉత్పత్తి వ్యయం తగ్గింపు, భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా కార్మికులకు సమాయత్తం చేయాలని సంస్థ నిర్ణయించింది.

ముందున్న సవాళ్లు

సింగరేణిలో ఇప్పటివరకు యాజమాన్యం, ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్యనే చర్చలు, సంప్రదింపులు ఉండేవి. ఇప్పుడు గతానికి భిన్నంగా తొలిసారి ప్రభుత్వం, యాజమాన్యం నేరుగా దసరా విందు పేరుతో కార్మికుల దగ్గరకు వెళుతోంది. దీంతో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. క్వార్టర్ల కేటాయింపు, ఇంటి పేరు మార్పు, బదిలీల వంటి అంశాలను సులభతరం చేయడం, కారుణ్య నియామకాల్లో పేరుకుపోయిన అవినీతిపై సంస్థ తరఫున ఎలాంటి స్పందన ఉంటుంది అనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఎందుకంటే కారుణ్యంలో పారదర్శకత కరువైపోవడంతో దళారులు రెచ్చిపోతున్నారు. మాయమాటలు చెబుతూ కార్మికుల కష్టార్జితాన్ని దోచేస్తున్నారు.

వేలంపై వైఖరి !

బొగ్గు బ్లాకుల వేలం అంశంపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం సింగరేణికి ఉంది. ఇప్పటి వరకు బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియకు సంస్థ దూరంగా ఉంది. అయితే అవసరమైతే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనే అంశాన్ని పరిశీలించేందుకు ఇప్పటికే ఆగస్టు 29న కార్మిక సంఘాలతో యాజమాన్యం సమావేశం నిర్వహించింది. ఇందులో ఐదు కార్మిక సంఘాలు వేలం ప్రక్రియలో పాల్గొనడాన్ని స్వాగతించాయి. మరీ రాబోయే దసరా విందులో ఈ అంశంపై చర్చ జరుగుతుందా.. లేదా అనేది తెలియాలంటే రేపటి వరకు వేచి చూడాల్సిందే.

సందేహాల నివృత్తి కోసమేనా..?

గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ రూ.4 వేల కోట్ల లాభాలు ప్రకటించింది. అందులో దాదాపు సగ భాగాన్ని భవిష్యత్ అవసరాల కోసం కేటాయించింది. మిగిలిన సొమ్ములో 33 శాతం లాభాల వాటాగా కార్మికులకు పంచుతోంది. అయితే మొత్తం లాభాల్లో 33 శాతం ఎందుకు పంచలేదనే సందేహాలు కార్మిక వర్గాల్లో ఉన్నాయి. దీంతో భవిష్యత్ కార్యాచరణపై కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు లాభాల వాటాపై ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు తొలిసారిగా యాజమాన్యం కార్మికులకు విందు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం అన్ని గనుల్లో కంపెనీ ఖర్చుతో పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే ప్రకటించారు.

మహాలక్ష్మీ విజయోస్తు!

- రామాలయంలో విజయలక్ష్మిగా అమ్మవారి దర్శనం
- నేడు ఐశ్వర్య లక్ష్మి అలంకరణలో ..



విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మహాలక్ష్మి అమ్మవారు బుధవారం విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానం ద్వారా పొందే విజయంతో అందరూ విజేయులుగా నిలవాలని, విజయోస్తు అని అర్చకులు అమ్మవారిని కీర్తించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం సామూహిక కుంకుమపూజలు జరిపారు. చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు సుందర కాండ పారాయణం చేశారు.

నేటి ఐశ్వర్యలక్ష్మి అలంకార విశిష్టత

‘అస్యేశానా జగతో విష్ణుపత్నీ’ అని కీర్తిస్తుంది యజుర్వేదం. ఐశ్వర్యం అంటే శాఖాపరమైన శక్తి సామర్థ్యాలని, అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకరాలు, కరుణారూపిణి అయిన ఈ అమ్మ శ్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడని శ్రీ పరాశరభట్టార్ కీర్తించారు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే శాసకత్వము, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని ప్రతీతి.

రామయ్యకు కమనీయంగా కల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలుచేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శ్రీ సరస్వతీదేవిగా పెద్దమ్మతల్లి

పాల్వంచరూరల్ : శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి అమ్మవారు బుధవారం శ్రీ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతఃకాలార్చన, శ్రీలక్ష్మీ గణపతి హోమం, వేదపారాయణం, శ్రీచక్రార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా శ్రీసరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. 80 మంది చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసాలు చేశారు. కాగా, అమ్మవారిని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వీరస్వామి దర్శించుకున్నారు. వివిధ ఆలయాల ఈఓలు రజనీకుమారి, వీ.వీ.నర్సింహారావు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు

కొత్త టీచర్లకు నియామకపత్రాలు



హైదరాబాద్ వెళ్లేందుకు ప్రకాశం స్టేడియానికి చేరుకున్న అభ్యర్థులు

జిల్లాలో 421 మందికి ఆర్డర్లు

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ – 2024లో జిల్లా నుంచి ఎంపికైన 421 మంది అభ్యర్థులు బుధవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నియామకపత్రాలు అందుకున్నారు. ఈ అభ్యర్థులంతా కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా తెల్లవారుజామునే హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వారి వెంట విద్యాశాఖకు చెందిన అధికారులు ఎస్‌కె.సైదులు, ఎన్.సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రభుదయాళ్ తదితరులు ఉన్నారు. నూతన ఉపాధ్యాయులను తొలుత జిల్లాలో వారి సబ్జెక్టు, ఉన్న ఖాళీల ప్రకారం పోస్టింగ్‌లు ఇస్తామని, త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించి, బోధనకు అనుమతిస్తామని అధికారులు పేర్కొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఆయుధ పూజ

కొత్తగూడెంరూరల్ : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని అమ్మవారి సన్నిధిలో ఎస్పీ రోహిత్‌రాజ్ బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు..

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రోహిత్ రాజ్‌తో పాటు పోలీస్ శాఖలో పనిచేసే మహిళా అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ చేసే బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రపంచంలో పూలను పూజించే సంస్కృతి తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, కష్టాలను తొలగించాలని ఆకాంక్షించారు. అనంతరం బతుకమ్మ పాటలకు నృత్యాలు వేస్తూ మహిళలు, పిల్లలు ఆనందంగా గడిపారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, డీసీఆర్బీ, ఏఆర్ డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, మల్లయ్యస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజ్ (ఇన్‌సెట్) బతుకమ్మకు పూజలు చేస్తున్న ఎస్పీ

లక్షన్నర ఎకరాల్లో మునగ సాగు లక్ష్యం

- ఆ దిశగా రైతులను ప్రోత్సహించండి
- అధికారులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో మునగ సాగు చేపట్టాలని, ఈ మేరకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. నర్సరీలు, అజోల్లా పెంపకం, కెనాల్‌బండ్ ప్లాంటేషన్, మహిళా శక్తి యూనిట్లు, చేపల పెంపకం, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, పీఎం విశ్వకర్మ పథకం అమలుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఈసీఎస్‌లతో బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీల్లో వాతావరణాన్ని బట్టి ఆయుర్వేదానికి అనుకూలమైన మొక్కలు పెంచాలన్నారు. జిల్లాలోని అన్ని కెనాళ్లకు ఇరువైపులా జామాయిల్, వెదురు, సుబాబుల్ మొక్కలను నాటాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో మునగ, ఉసిరి, పనస, మారేడు, మేడి, అల్లనేరేడు మొక్కలు నాటాలని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ పరిధిలోని గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్ని మొక్కలు నాటుతారో అంచనా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి, 85 వేల ఎకరాలలో మొక్కజొన్న, రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని తెలిపారు. వీటితోపాటు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళా శక్తి యూనిట్లు, గ్రామాభివృద్ధి ప్రణాళిక, పీఎం విశ్వకర్మ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఓ చంద్రమౌళి, అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి, డీఏఓ బాబురావు, జిల్లా పరిశ్రమల శాఖాధికారి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న అనుబంధం!

- పొరుగు రాష్ట్రమైనా బతుకమ్మపై మక్కువ
- ఇతర రాష్ట్రాలకు కోడళ్లుగా వెళ్లిన వారూ రావాల్సిందే...
- సంస్కృతి, సంప్రదాయంలో భాగమని భావన
- బంధుత్వం, స్నేహాన్ని వీడలేక కలుస్తున్న ఆడబిడ్డలు

తెలంగాణ ఆడబిడ్డలు జరుపుకునే పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. పూలను పూజించే పండుగ ప్రపంచంలో ఇదొక్కటే కావడం.. తెలంగాణలో మాత్రమే జరుపుకుంటుండడం విశేషం. తెలంగాణ ఏర్పడి బతుకమ్మను రాష్ట్రపండుగగా గుర్తించాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండుగకు మరింత ప్రాముఖ్యత ఏర్పడింది. ప్రస్తుతం బతుకమ్మ చివరి అంకానికి చేరింది. అయితే, ఈ పండుగకు ఎక్కడెక్కడో ఉన్న ఆడబిడ్డలు పుట్టింటికి చేరడం ఆనవాయితీగా వస్తోంది. విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆడబిడ్డలు కూడా రానుండడం ఓ విశేషమైతే.. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు కోడళ్లుగా వచ్చిన అతివలు సైతం బతుకమ్మపై మక్కువ పెంచుకుని సద్దులకు సిద్ధమవుతుండడం మరో విశేషం. ఈ నేపథ్యాన నేడు(గురువారం) సద్దుల బతుకమ్మ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి రానున్న ఆడబిడ్డలు.. ఇతర రాష్ట్రాల నుంచి కోడళ్లుగా వచ్చిన అతివల అభిప్రాయాలతో కథనం.
– ఖమ్మంగాంధీచౌక్

వైభవంగా జరుపుకుంటాం..



మా స్వస్థలం రాజమండ్రి. 2014లో ఖమ్మం వాసి నవీన్‌తో పెళ్లయింది. అప్పుడే తెలంగాణ ఏర్పడగా, తొలుత పండుగ ప్రత్యేకత తెలియకున్నా సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని తెలుసుకున్నా. అందుకే ఏటా బతుకమ్మ ఇక్కడే ఘనంగా నిర్వహిస్తాం.
– యమున, విజయనగర్ కాలనీ, ఖమ్మం



బతుకమ్మ ఆడుతున్న డీఆర్‌డీఏ మహిళా ఉద్యోగులు

ఏటా పుట్టింట్లోనే బతుకమ్మ..



ఉద్యోగరీత్యా అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నాం. ఏటా బతుకమ్మకు ఖమ్మం వస్తాం. అమ్మ వారి ఇంట్లో బంధువులు, స్నేహితులతో కలిసి ఎంగిలి పూలు మొదలు సద్దుల వరకు వేడుకగా జరుపుకుంటాం. దసరా పూర్తయ్యాక అమెరికా వెళ్తాం.
– విదాల నిఖిత, పీఎస్ఆర్ రోడ్డు, ఖమ్మం

ఇల్లెందు మార్కెట్ పాలకవర్గం ఎన్నిక

- చైర్మన్‌గా రాంబాబు, వైస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు
- 12 మంది డైరెక్టర్లు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యుల నియామకం

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు మార్కెట్లకు పాలక వర్గాలను ప్రకటించగా జిల్లాలో ఇల్లెందు మార్కెట్‌కు చోటు దక్కింది. చైర్మన్‌గా మాణిక్యారం గ్రామానికి చెందిన బానోతు రాంబాబు, వైస్ చైర్మన్‌గా బయ్యారం మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లుతో పాటు 12 మంది డైరెక్టర్లను నియమించారు. వీరిలో ఇద్దరు ట్రేడర్లు కూడా ఉండగా, అదనంగా మరో నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులను నియమించారు. గత రెండేళ్లుగా మార్కెట్ పాలక వర్గాన్ని నియమించలేదు. నాటి ఎమ్మెల్యే హరిప్రియ ఐదేళ్ల కాలంలో ఒకే దఫా చైర్మన్ ఎంపిక జరగగా ఆమె భర్త హరిసింగ్‌ను నియమించారు. ప్రస్తుత కమిటీలో మాణిక్యారం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బానోతు రోజా భర్త రాంబాబును చైర్మన్ పదవి వరించింది. కాగా, ఎన్నికైన వారిలో అందరూ గిరిజనులే ఉన్నారు. ఈ మార్కెట్ పరిధిలో 8 మండలాలు ఉండగా, ప్రతీ మండలం నుంచి ప్రాతినిధ్యం ఉండేలా నియమించారు. విజయదశమికి ముందు మార్కెట్ కమిటీ ప్రకటన వెలువడడంతో ఇల్లెందు కాంగ్రెస్ పార్టీలో జోష్ నెలకొంది.





ఇల్లెందు మార్కెట్ కార్యాలయం (ఇన్‌సెట్) నూతన చైర్మన్ రాంబాబు

క్లుప్తంగా

మావోయిస్టుల ఫ్లెక్సీల కలకలం



సండెళ్ల రామాపురంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బూర్గంపాడు: బూర్గంపాడు మండలం సండెళ్ల రామాపురంలో మంగళవారం రాత్రి మావోయిస్టుల ఫ్లెక్సీలు వెలిశాయి. వారం క్రితం పోస్టర్లు వేయగా, మళ్లీ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడం చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ 20వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, మావోయిస్టు పార్టీ నిర్మూలనకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తిప్పికొట్టాలని ఫ్లెక్సీల్లో పిలుపునిచ్చారు. సీపీఐ(మావోయిస్ట్) మణుగూరు–పాల్వంచ ఏరియా పేరిట ఈ ఫ్లెక్సీలు ఏర్పాటుకాగా, పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, ఫ్లెక్సీలతో పాటు చేతి రాతతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేయడం, సండెళ్ల రామాపురం జాతీయ రహదారి పక్కనే ఉండటం గమనార్హం.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం అశ్వారావుపేట గ్రామ శివారులో ఎస్సై యయాతి రాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి, ఇసుక తరలిస్తున్న దొంతికుంటకు చెందిన మురుగుంట్ల అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టేకులపల్లిలో...



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

టేకులపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను బుధవారం టేకులపల్లి పోలీసులు సీజ్ చేశారు. వెంకట్యాతండా సమీపంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని, అనంతరం వాహనాలను తహసీల్దార్‌కు అప్పగించామని ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

కలప స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని గౌరారం గ్రామంలో అక్రమంగా దాచి ఉంచిన కలప చెక్కలను రేంజర్ కమల, సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. గ్రామంలో దాచి ఉంచిన కలపను గుర్తించి స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.40 వేల విలువ కలిగి ఉంటుందని అధికారులు తెలిపారు.

గంజాయి సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్‌ఐ విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద 14.2 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన ఇద్దరు నిందితులు సీలేరులో కొనుగోలు చేసి బస్సులో తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 2.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పూలు.. ఔషధ గుణాలు !

- బతుకమ్మను పేర్చే ప్రతి పువ్వూ ప్రత్యేకమే...
- సువాసనకు తోడు ఆరోగ్యాన్ని పెంచడానికి దోహదం



రకరకాల పూలతో పేర్చిన బతుకమ్మలు

పాల్వంచరూరల్: ఆనందోత్సాహాల మధ్య మహిళలు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే పండుగ బతుకమ్మ. ఈ సందర్భంగా బతుకమ్మ పేర్చేందుకు ఉపయోగించే పూలలో ఎన్నో ఔషధ గుణాలు మిళితమై ఉన్నాయి. ఈ పుష్పాలు సువాసనలు వెదజల్లడమే కాకుండా ఆరోగ్యాన్ని కూడా పెంచుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా పూలతోపాటు ఆకులు, పసుపు కుంకుమతో ఆడే బతుకమ్మల వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తుందనే ప్రచారం ఉంది. ఈ సందర్భంగా బతుకమ్మ పేర్చడంలో ఉపయోగించే పూల ప్రత్యేకతలు...

◆ **గుమ్మడి పూవు :** ఈ పూలలోని పిందెలాంటి రూపాన్ని బతుకమ్మలో అలంకరిస్తారు. ఇందులో ఏ–విటమిన్ అధికంగా ఉండడం వల్ల కంటి సంబంధ వ్యాధుల మందుల తయారీలో వినియోగిస్తారు. అలాగే, సబ్బులు, కాస్మోటిక్స్ తయారీలోనూ ఉపయోగిస్తారు. జీర్ణ వ్యవస్థలో సమస్యల నివారణకు ఇది ఉపయోగపడుతుందని.. ఉష్ణోగ్రతలను సమతుల్యంగా చేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

◆ **తామర పూవు :** తామెర పూలను రక్తస్రావ నివారణకు మందుగా వాడతారు. ఈ పూలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతాయి. ఈ వాసన ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

◆ **బీర పూవు :** వానాకాలం సీజన్‌లో ఇంటింటా ఉండే బీర పూలను బతుకమ్మల్లో పేరుస్తారు. లూఫా అని పిలిచే బీరపూవును చర్మ సంబంధ, జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేసే మందుల తయారీలో ఉపయోగిస్తారు.

◆ **గడ్డి పూవు :** బతుకమ్మలో తెల్లగా కన్పించేది గడ్డి పువ్వు. ఈ పువ్వు యాంటీబయోటిక్ లక్షణాలు కలిగిఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో ఈ పువ్వును రక్తస్రావం తగ్గించడానికి ఉపయోగిస్తుంటారు.

◆ **బంతి పూవు :** బతుకమ్మ పేర్చే పూలలో ప్రధానమైనది బంతి పూవు. ఈ పూలతో కూడా సుగంధ తైలాలు తయారుచేస్తారు. రక్తస్రావం నిలిపే మందుల తయారీలోనూ ఉపయోగిస్తారు.

◆ **తంగేడు పూవు :** బతుకమ్మకు ప్రత్యేకం తంగేడు పువ్వు. ఈ పువ్వు లేనిదే బతుకమ్మలు ఉండవనే చెప్పాలి. ఈ పువ్వు చర్మవ్యాధుల నివారణ, ఉదర కోశ వ్యాధుల నివారణకు మందుల్లో వాడతారు.

◆ **గునుగు పూలు :** గునుగు పూలు ఎక్కువగా అటవీ ప్రాంతం, గుట్టల్లో పెరుగుతాయి. గడ్డి జాతికి చెందిన సహజవర్ణ పూలు ఇవి. ఈ పూలను అతిసార వ్యాధి నివారణకు మందుగా వాడతారు. అదేవిధంగా తుమ్మ, దోస పూలను సైతం బతుకమ్మల్లో వినియోగిస్తుండగా.. వీటిని సైతం ఆయుర్వేద మందుల తయారీకి ఉపయోగిస్తారు.

ప్రతీ పూవులో ఔషధ గుణాలు



బతుకమ్మ పేర్చడంలో వినియోగించే రకరకాల పూలు ఔషధ లక్షణాలు కలిగి ఉంటాయి. గుమ్మడి పూలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయి. బలహీనంగా ఉన్న వారు వినియోగిస్తే ఫలితం ఉంటుంది. తంగేడు పూలలో చర్మసంబంధ, మూత్ర సంబంధిత, మధుమేహ వ్యాధుల నివారణలో ఉపయోగపడుతుంది. ఇలా పలురకాల పుష్పాల్లో ఔషధగుణాలు పుష్కలంగా ఉన్నాయి.

– లావణ్య, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు

పూల కోసం వెళ్తూ..

- ఇద్దరు భవానీ మాలధారులు మృతి
- ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టడంతో ప్రమాదం
- రెండు గ్రామాల్లో నెలకొన్న విషాదం

జూలూరుపాడు/పాల్వంచరూరల్: జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాల్వంచ మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం బసవతారక కాలనీకి చెందిన గుగులోత్ గోవింద్, జ్యోతి దంపతుల పెద్ద కుమారుడు మనోహర్ కేఎల్‌ఆర్ కళాశాలలో ఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నాడు. తొలిసారిగా భవానీ మాల ధరించాడు. ఇదే మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన బానోత్ కవిత కుమారుడు సంతోష్‌కుమార్ గ్రామంలోనే హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కూడా తొలిసారిగా భవానీ మాల వేసుకున్నాడు. వీరిద్దరూ పూజ కోసం పూలు తెచ్చేందుకు బుధవారం ఆటోలో జూలూరుపాడు వెళ్తున్నారు. అదే సమయంలో మణుగూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి మణుగూరు వైపు వస్తోంది. ఈ క్రమంలో జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బానోత్ సంతోష్ కుమార్(24), గుగులోత్ మనోహర్(20) ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ బి.రాణా ప్రతాప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.



మనోహర్(ఫైల్)



సంతోష్‌కుమార్ (ఫైల్)

గ్రామాల్లో విషాదఛాయలు

యువకుల మృతితో వారి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరూ తొలిసారి భవానీ మాల వేసుకుని పూల కోసం వెళ్లి ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. బసవతారక కాలనీకి చెందిన గోవింద్‌కు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు మనోహర్. బీ.ఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నాడు. చదువు పూర్తై కుమారుడు చేతికందుతున్నాడని తల్లిదండ్రులు సంతోష పడుతున్నారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం కుమారుడిని కబళించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ ఇంటి దీపం ఆరిపోయిందంటూ రోదిస్తున్నారు. జగన్నాథపురానికి చెందిన బానోత్ కవితకు కుమార్తెతోపాటు కుమారుడు సంతోష్ కుమార్ ఉన్నారు. కుమార్తె వివాహం జరిపించగా, కుమారుడు గ్రామంలోనే హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి, సోదరి గుండెలవిసేలా రోదిస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

- బతుకమ్మ పూలకు వెళ్లి ప్రమాదం బారిన..



ఐలయ్య (ఫైల్)

అశ్వాపురం: పండుగ పూట ఇంట్లో బతుకమ్మ పేర్చాలని పూల కోసం వెళ్లి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో బుధవారం జరిగింది. మండలంలోని జగ్గారం గ్రామానికి చెందిన నున్నా ఐలయ్య(38) మణుగూరు సుర్క్షా బస్టాండ్‌లో హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం బతుకమ్మ పూల కోసం వెళ్లి, ప్రమాదవశాత్తు గ్రామంలోని ఊర చెరువులో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృదేహానికి మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేటీసీలో కార్మికుల ఆందోళన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీలో పనిచేస్తున్న ఓబీ, కోల్ కార్మికులు, హెల్పర్లు, డ్రైవర్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు తదితర కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. సింగరేణిలోని మిగిలిన ఏరియాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లించినప్పటికీ కేటీసీలో మాత్రం కాంట్రాక్టర్ ఇచ్చే బోనస్, సింగరేణి ఇచ్చే బోనస్ చెల్లించలేదని నిరసన తెలిపారు. రెండో షిఫ్టు, రాత్రి షిఫ్టులో పనులు నిలిపివేయడంతో ఓబీ పనులు, బొగ్గు వెలికితీత, రవాణా పనులు నిలిచిపోయాయి. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత కోరం సురేందర్ తదితరులు ఆందోళన వద్దకు వెళ్లి ఎల్‌ఎస్‌ఎన్ సంస్థ ఇన్‌చార్జ్‌తో చర్చలు జరిపారు. గురువారం ఉదయం 11 గంటల లోపు బోనస్, వేతనం ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి విధుల్లోకి వెళ్లారు. గురువారం హామీ అమలు చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గుండాల మండలం వెన్నెలబైలు గ్రామానికి చెందిన సమ్మయ్య ఇల్లెందు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. లచ్చగూడెం గ్రామానికి చెందిన నవీన్, సత్యమ్మ, శిరోమణి మరో బైక్‌పై శెట్టుపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొమరారం గ్రామంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురిని ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. వీరిలో సమ్మయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సిఫారసు చేశారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ములకలపల్లి : దాడి ఘటనలో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ రాఘూరావు కథనం ప్రకారం.. మండలంలోని రింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుమారు పది మంది రైతులు ఐటీడీఏ నుంచి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా తమ వ్యవసాయ మోటార్లు నడుపుకుంటున్నారు. ఇదే గ్రామంలో ఉంటున్న తుమ్మల రాధాకృష్ణ కొంతకాలంగా ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ తీగలు కలిపి విద్యుత్ వినియోగించుకుంటున్నాడు. పలుమార్లు వద్దని చెప్పినా రాధాకృష్ణ వినడంలేదు. ఈ క్రమంలో ఈ నెల 4న రాధాకృష్ణ తీగలు కలుపుతుండగా, బైటి జోగులు అనే రైతు అడ్డుకోగా ఘర్షణ జరిగింది. జోగులుపై రాధాకృష్ణ దాడి చేయడంతోపాటు చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి

దమ్మపేట: ప్రయాణిస్తున్న లారీలోనే గుండెపోటుతో క్లీనర్ మృతి చెందిన ఘటన మందలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన పిన్నింటి నర్సిరెడ్డి(37) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. డ్రైవర్ కోమటిరెడ్డి నవీన్‌కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి బొగ్గు లోడ్ లారీలో వైజాగ్ నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో లారీ బుధవారం మందలపల్లికి చేరుకోగా నిద్రలో ఉన్న క్లీనర్ నర్సిరెడ్డిని, డ్రైవర్ లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. దీంతో సమాచారం అందించగా, 108 అంబులెన్స్‌తో వచ్చిన సిబ్బంది పరీక్షించి గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతుడి బావ సింగిరెడ్డి సుఖేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

రిమాండ్‌కు తరలింపు

ములకలపల్లి: వివాహిత ఆత్మహత్య ఘటనలో నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మూకమామిడి గ్రామానికి చెందిన రేణుక (23)ను 2022లో టేకులపల్లి మండలం దంతాలతండాకు చెందిన భూక్యా బాబూలాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి సంతానం కలగకపోవడంతో భర్త బాబూలాల్, కుటుంబ సభ్యులు రేణుకను వేధిస్తూ, పుట్టింటికి పంపించారు. ఈ తరుణంలో మనస్తాపం చెంది గత నెల 27న పురుగుల మందు తాగింది. చికిత్స పొందుతూ ఈనెల 2న మృతి చెందింది. మృతురాలి తల్లి హుస్సేని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భర్త బాబూలాల్, అత్త బుల్లి, మామ లాల్‌సింగ్‌లతోపాటు మరో నలుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

గృహోపకరణాలు దగ్ధం

సుజాతనగర్: షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చింతకాయల రమ్మశ్రీ ఇంట్లో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. ఆర్‌ఐ కాంతారావు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. రూ.22 వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆర్‌ఐ తెలిపారు.

రైలులో సీఐఎస్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఖమ్మంక్రైం: రైలులో ప్రయాణిస్తున్న సీఐఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో వైజాగ్‌కు చెందిన సీఐఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణమూర్తి(55) విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన స్వస్థలానికి వెళ్లేందుకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరగా రైలు వరంగల్ దాటాక అస్వస్థతకు గురయ్యాడు. ఖమ్మంలో రైలు ఆపి జిల్లా ఆస్పత్రికి తరలించేసరికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

‘అంకుర’లో అధునాతన వైద్యసౌకర్యాలు

ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన యాజమాన్యం

ఖమ్మంవైద్యవిభాగం: అత్యుత్తమ, ఆధునాతన సేవలు అందించేలా అంకుర ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం గొరిల్లా పార్క్, సీక్వెల్ రిసార్ట్ సమీపాన నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం మంత్రులు, ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యసేవల్లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, హైదరాబాద్ తర్వాత అంతటి కీర్తిని సొంతం చేసుకున్న ఖమ్మంలో అంకుర ఆస్పత్రి ద్వారా వ్యాపార దృక్పథంతో చూడకుండా సేవలు అందిస్తుండటం అభినందనీయమని చెప్పారు. అనంతరం అంకుర ఆస్పత్రి వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. అన్ని బ్రాంచ్‌లలో మొత్తం 1,800 పడకలు ఉండగా, ఏళ్లుగా ఖమ్మంలో విశిష్ట సేవలు అందిస్తున్న తాము నూతన భవనంలో 120 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. తమ ఆస్పత్రిలో 3ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉండగా, సంతానోత్పత్తి విషయంలో ప్రపంచ సగటును మించి విజయాలు నమోదవుతున్నాయని తెలిపారు. అంకుర అస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ చల్లగుళ్ల, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మేయర్ పి.నీరజ, డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, క్లస్టర్ మెడికల్ హెడ్ డాక్టర్ దుర్గాప్రసాద్, మెడికల్ డైరెక్టర్ సందీప్‌రెడ్డితో పాటు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలస్వామి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు సీఎండీ అభినందన



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియా కార్మికుడు, మొక్కల రాజశేఖర్‌ను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఘనంగా సన్మానించారు. మన్‌కీ బాత్ 114వ కార్యక్రమంలో రాజశేఖర్‌ను ప్రధాని నరేంద్రమోదీ అభినందించిన విషయం విదితమే. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణిలో తాను సుమారు 18 వేల మొక్కలు నాటానని తెలిపారు. మీరు ఒక్కరే సుమారు 15 వేల మొక్కలు నాటడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో సింగరేణీయులు తమ ఇళ్లల్లో శుభకార్యం రోజు మొక్కలు నాటితే ప్రతి అడుగు పచ్చదనంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకునూరి కనకరాజు, గౌస్ పాల్గొన్నారు.

గొత్తి కోయలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

తెలంగాణా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు



గోపగాని శంకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

చర్ల: గొత్తికోయలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని తెలంగాణా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన చర్లకురాగా, మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల యువకులు తమ సమస్యలు విన్నవించారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడుతూ గొత్తి కోయలకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని అన్నారు. కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రదీప్, ఆదివాసీ యువకులు మడకం చందు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్ననాటి రతన్ టాటా (ఎడమవైపు)


జేఆర్‌డీ టాటాతో రతన్


ప్రధాని మోదీతో రతన్ టాటా


2008లో నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా పద్మవిభూషణ్ అందుకుంటున్న రతన్ టాటా


ఎఫ్18, ఎఫ్16 యుద్ధవిమానాల్లో ప్రయాణిస్తున్న రతన్



రతనాల మాట..

జీవితంలో ఎత్తు, పల్లాలు ఉండాల్సిందే. కొన్ని సార్లు స్ట్రెయిట్ లైన్ కూడా బాగుండదు. ఈసీజీ రిపోర్ట్‌లో సరళ రేఖ వచ్చిందంటే మనం బతికిలేమని అర్థం

వాస్తవిక ప్రపంచంలో వస్తువులు ఎందుకూ పనికిరావని ఏదో ఒకనాడు మనం అర్థం చేసుకుంటాం. అన్నింటికంటే ప్రేమే ముఖ్యమని గ్రహిస్తాం

ఉత్తమమైన లీడర్ ఎవరంటే.. వాళ్లకంటే అత్యంత తెలివిగా వ్యవహరించే అనుచరులు, సహాయకులను చుట్టూతా పెట్టుకున్న వాళ్లే.

వృత్తిజీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత సాధించడం మీద నాకు పెద్దగా నమ్మకం లేదు. వృత్తిని, జీవితాన్ని సమ్మిళితం చేసుకోవడమే నాకిష్టం. పని, జీవితాన్ని అత్యంత అర్థవంతంగా మార్చుకోండి

జీవితంలో పెద్ద రిస్క్ ఏంటంటే రిస్క్‌ను తీసుకోకపోవడమే. క్షణక్షణం మారే ప్రపంచంలో రిస్కులు తీసుకోలేదంటే మనం ఫెయిల్ అయిపోతాం

నిరంతరం హుషారుగా ఉండండి. అప్పుడే విజయం మీ వశమవుతుంది

ఇతరులతో సంభాషించేటప్పుడు దయ, సహానుభూతి, కరుణతో మెలగండి. వాటిని తక్కువ అంచనా వేయొద్దు

నాయకత్వం అనేది బాధ్యత తీసుకోవడం మాత్రమే. సాకులు చెప్పడం కాదు

అవకాశాలు మీ చెంతకు వస్తాయని వేచి చూడొద్దు. మీరే వాటిని సృష్టించుకోండి

ఎల్లప్పుడూ సుఖప్రదమైన జీవితం మీకు ఉండకపోవచ్చు. అలాగే ప్రపంచ సమస్యలు అన్నింటినీ మీరు పరిష్కరించలేకపోవచ్చు. కానీ మీ ప్రాధాన్యాన్ని మీరు తక్కువగా అంచనావేయొద్దు. ధైర్యం అనేది ఒక అంటువ్యాధిలా వ్యాపించేది. ఆశ జీవితాన్ని నిలబెడుతుంది.

- రతన్ టాటా


నానో కారు ఆవిష్కరణలో...

అనితర సాధ్యుడు..

పుట్టిన తేదీ, స్థలం: 1937 డిసెంబర్ 28, ముంబై (అప్పట్లో బాంబే)

విద్యాభ్యాసం: కార్నెల్ యూనివర్సిటీ (బీఆర్క్)

తల్లిదండ్రులు: నావల్ టాటా, సూనూ టాటా

పురస్కారాలు: పద్మవిభూషణ్ (2008), మహారాష్ట్ర భూషణ్ (2006), పద్మభూషణ్ (2000)

బాల్యం..విద్యాభ్యాసం..

పారిశ్రామిక దిగ్గజం, వితరణశీలి రతన్ టాటా చాలా సాధారణ జీవితం గడిపేవారు. ఆయన 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెడ్‌జీ టాటా కుమారుడు రతన్‌జీ టాటా దత్తత తీసుకున్న నావల్ టాటా, సూనూ టాటా ఆయన తల్లిదండ్రులు. 1948లో ఆయన తల్లిదండ్రులు విడిపోవడంతో రతన్‌జీ టాటా సతీమణి అయిన నవాజ్‌బాయ్ టాటా సంరక్షణలో పెరిగారు. జిమ్మీ టాటా ఆయనకు సోదరుడు కాగా, నోయెల్ టాటా సవతి సోదరుడు. రతన్ టాటా ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అటుపైన అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు.

100 బిలియన్ డాలర్లకు టాటా గ్రూప్..

రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. సాధారణ ఉద్యోగి తరహాలోనే పని చేస్తూ కుటుంబ వ్యాపార మెళకువలు తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక సమస్యల్లో ఉన్న నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ (నెల్కో)కి డైరెక్టర్ ఇంచార్జ్‌గా 1971లో ఆయన నియమితులయ్యారు. కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఆర్థిక మందగమనం, కార్మిక సంఘాలపరమైన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. 1977లో సంక్షోభంలో ఉన్న మరో గ్రూప్ సంస్థ ఎంప్రెస్ మిల్స్‌కి ఆయన బదిలీ అయ్యారు. మిల్లును పునరుద్ధరించేందుకు ఆయన ప్రణాళికలు వేసినప్పటికీ మిగతా అధికారులు కలిసి రాకపోవడంతో సంస్థను అంతిమంగా మూసివేయాల్సి వచ్చింది. మొత్తానికి 1991లో జేఆర్‌డీ టాటా ఆయన్ను టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమించారు. భారీ బాధ్యతలను మోయడంలో ఆయనకున్న సామర్థ్యాలపై సందేహాల కారణంగా మిగతా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ రతన్ టాటా వాటన్నింటినీ తోసిరాజని తన సత్తా నిరూపించుకున్నారు. గ్రూప్‌ను అగ్రగామిగా నిలిపారు. తన హయాంలో మేనేజ్‌మెంట్ తీరుతెన్నులను పూర్తిగా మార్చేసి గ్రూప్ కంపెనీలను పరుగులు తీయించారు. 2012లో ఆయన టాటా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత చైర్మన్‌గా నియమితులైన సైరస్ మిస్త్రీతో విభేదాలు రావడంతో తిరిగి 2016 అక్టోబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు మరోసారి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. అటు తర్వాత ఎన్.చంద్రశేఖరన్‌కు పగ్గాలు అప్పగించారు. 21 సంవత్సరాల పాటు సాగిన రతన్ టాటా హయాంలో గ్రూప్ ఆదాయాలు 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో భారీగా విస్తరించారు రతన్ టాటా. ఆయన సారథ్యంలో టాటా గ్రూప్ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. సాఫ్ట్‌వేర్, టెలికం, ఫైనాన్స్, రిటైల్ తదితర రంగాల్లోకి గ్రూప్ విస్తరించింది. రతన్ టాటా బాధ్యతలు చేపట్టినప్పుడు 1991లో కేవలం రూ. 10,000 కోట్లుగా ఉన్న గ్రూప్ టర్నోవరు 2011–12లో ఆయన తప్పుకునే సమయానికి ఏకంగా 100 బిలియన్ డాలర్లకు ఎగిసింది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అన్ని విభాగాల్లోకి విస్తరించింది. పలు విదేశీ కంపెనీలను కొనుగోలు చేయడంతో గ్రూప్ ఆదాయాల్లో దాదాపు సగ భాగం విదేశాల నుంచే ఉంటోంది. ఆయన సాహసోపేత నిర్ణయాల కారణంగా కోరస్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, టెట్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు టాటా గ్రూప్‌లోకి చేరాయి. నానో, ఇండికా కార్లు ఆయన విజనే.

వితరణశీలి.. ఇన్వెస్టరు..

రతన్ టాటా గొప్ప వితరణశీలి. తన సంపదలో దాదాపు 60–65 శాతం భాగాన్ని ఆయన వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలకు విరాళమిచ్చారు. 2008లో కార్నెల్ వర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళమిచ్చారు. ప్రధానంగా విద్య, ఔషధాలు, గ్రామీణాభివృద్ధి మొదలైన విభాగాలపై దృష్టి పెట్టారు. ఆయన పలు అంకుర సంస్థల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టారు. వ్యక్తిగత హోదాలో అలాగే ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా 30కి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. స్నాప్‌డీల్, షావోమీ, ఓలా క్యాబ్స్, మొదలైన వాటిలో పెట్టుబడులు పెట్టారు. సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన గుడ్‌ఫెలోస్ అనే స్టార్టప్‌కు తోడ్పాటు అందించారు.



పురస్కారాలు పారిశ్రామిక దిగ్గజంగానే కాకుండా వితరణశీలిగా కూడా పేరొందిన రతన్ టాటాను పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి. పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతో పాటు ఆయన మహారాష్ట్ర భూషణ్, అస్సాం వైభవ్ వంటి అవార్డులను కూడా అందుకున్నారు.

సిమీ గ్రేవాల్‌తో అనుబంధం.. రతన్ టాటా వివాహం చేసుకోవాలనుకున్నా సాధ్యపడలేదని ఆయనే పలు సందర్భాల్లో తెలిపారు. నాలుగు సార్లు వివాహానికి దగ్గరగా వచ్చినా పలు కారణాల వల్ల వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో బాలీవుడ్ నటి సిమీ గ్రేవాల్‌తో ఆయన ప్రేమలో పడినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆమె ఆ తర్వాత మరొకరిని వివాహం చేసుకున్నారు.

మిస్త్రీతో వివాదం.. టాటా గ్రూప్ చైర్మన్‌గా రతన్ టాటా ఏరి కోరి సైరస్ మిస్త్రీని తన వారసుడిగా నియమించారు. కానీ మిస్త్రీ పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. చివరికి 2016లో మిస్త్రీ ఉద్వాసనకు దారితీశాయి. దీనిపై ఇరువర్గాల మధ్య సుదీర్ఘ న్యాయపోరాటం జరిగింది.

జిల్లా వార్తలు


రామయ్య సన్నిధిలో భూపాలపల్లి ఎమ్మెల్యే


ధ్వజస్తంభం వద్ద కుటుంబీకులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు పాల్గొన్నారు.

తుపాకీ వదిలి.. చాక్‌పీస్ పట్టి !

- కానిస్టేబుల్‌గా పనిచేస్తూ టీచర్‌గా ఎంపిక


కానిస్టేబుల్‌గా విధినిర్వహణలో రంజిత్

టేకులపల్లి: అసాంఘిక శక్తులను అరికట్టేందుకు తుపాకీతో విధులు నిర్వర్తించిన ఆ యువకుడు ఇకపై చాక్‌పీస్ చేతపట్టి పాఠాలు బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దనున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ పరిధి మంగళితండాకు చెందిన ధరావత్ పాండ్యా – కౌసల్య దంపతుల చివరి సంతానం రంజిత్ మంగళితండా, వరంగల్, టేకులపల్లిలో ఇంటర్ వరకు చదివాక హైదరాబాద్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ చేశాడు. ఆపై అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేస్తుండగా తృతీయ సంవత్సరంలోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2019 సెప్టెంబర్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైన రంజిత్ వరంగల్, ములుగు జిల్లాల్లో విధులు నిర్వర్తించాక 2022 ఆగస్టులో మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో అటు ఉద్యోగం చేస్తూనే సిద్ధమైన ఆయన గతనెల 30న విడుదలైన ఫలితాల్లో భద్రాద్రి జిల్లా ఓపెన్ కేటగిరీలో 10, ఎస్టీ కేటగిరీలో ఐదో ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాడు. ఆయన బుధవారం నియామక పత్రం అందుకోగా, ఇటీవల ఆయన మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్, అధికారులు రంజిత్‌ను సత్కరించారు.

17న భక్త శబరికి స్మృత్యంజలి!


భద్రాచలంలోని శబరి విగ్రహం

- భద్రాద్రి రామాలయంలో యాత్ర, పుష్పాంజలి
- గిరిజనుల చెంత రామయ్య కల్యాణానికి ఏర్పాట్లు
- ఈ ఏడాది వినాయకపురంలో నిర్వహించాలని నిర్ణయం

భద్రాచలం: అయోధ్యరాముడి కోసం ఏళ్లుగా ఎదురుచూసి.. అరణ్యవాసంలో ఆయనకు ఎంగిలి పండ్లను ప్రసాదంగా అందజేసి రాముడి కరుణతో ముక్తి పొందిన గిరిజన భక్తురాలు శబరి. ఆమె స్మృతి యాత్ర ఈనెల 17న భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరగనుంది. భద్రాచల రామయ్య సన్నిధానాన జరిగే పూజల్లో భక్తులను భాగస్వాములను చేసేందుకు ఈ యాత్రను 2013లో ప్రారంభించారు. ఏటా అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున జరిగే వేడుక గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, ఆటపాటల నడుమ ప్రత్యేకంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఈనెల 17న ఉదయం 6–30 గంటల నుంచి గిరి ప్రదక్షిణ, 8–30 గంటల నుంచి చిత్రకూట మండపంలో నిత్యకల్యాణం, 11.30 గంటలకు వివిధ రకాల పండ్లు, పుష్పాలతో రామయ్యకు పుష్పాంజలి నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు వారి ప్రాంతాల్లో లభించే పండ్లు, పూలను రామయ్యకు సమర్పించడం ఇందులో ప్రత్యేకత.

గిరిజనుల చెంతనే రామయ్య కల్యాణం

భద్రాచలం దివ్యక్షేత్రంలో దమ్మక్క, శబరికి ప్రత్యేక స్థానం ఉంది. భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనల్లోనూ వీరికి స్థానం దక్కింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న వీరిని స్మరించుకుంటూ సాగుతున్న ఈ యాత్రల్లో గతంలో ఏటా గిరిజనులను భాగస్వాములను చేసేవారు. కూనవరం, వీఆర్ పురం, చర్ల, దమ్మపేట వంటి గిరిజన గ్రామాల వాసులను ఆర్టీసీ బస్సుల్లో ఒక రోజు ముందుగానే భద్రాచలానికి తీసుకొచ్చి ఉచిత వసతి, భోజనం కల్పించేవారు. రెండు రోజుల పాటు వీరికి స్వామి వారి ఉచిత దర్శనం, నిత్యకల్యాణంలో పాల్గొనే అవకాశం ఇచ్చేవారు. అయితే ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించాక ఈ కార్యక్రమాలు కొనసాగిస్తూనే గిరిజన గ్రామాలకు ప్రచార రథం పంపించి అక్కడి ప్రజల నడుమే రామయ్య కల్యాణ మహోత్సవం నిర్వహించడం మొదలుపెట్టారు. తద్వారా భద్రాద్రి రామయ్య అందరివాడనే భావన కల్పించడమే కాక రామయ్య తమ ఇళ్ల ముంగిటకు వచ్చాడని గిరిజనులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది శబరి స్మృతి యాత్ర రోజున అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8–30 నుంచి 10 గంటల వరకు గ్రామంలో రామయ్య ప్రచారరథంతో శోభాయాత్ర నిర్వహించాక ముత్యాలమ్మ ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా ఏపీలోని వరరామచంద్రాపురం వద్ద ఉన్న శబరి నది సమీపాన దేవస్థానం ఆధ్వర్యంలో అభిషేకం, వస్త్రాలు, పండ్ల సమర్పణ జరగనుంది.

గిరిజనులు భాగస్వాములు కావాలి



రామయ్య పూజల్లో గిరిజనులను భాగస్వామ్యం చేయడం.. అపర భక్తురాలు శబరిని గుర్తు చేసుకునేందుకు స్మృతి యాత్ర చేపడుతున్నాం. ఈనెల 17వ తేదీన భద్రాచలం రామాలయంలో జరిగే యాత్రలో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. అదేవిధంగా అశ్వారావుపేట మండలం వినాయకపురం గిరిజన గ్రామంలో జరగనున్న రామయ్య కల్యాణాన్ని జయప్రదం చేయాలి.

– ఎల్.రమాదేవి, ఈఓ, రామాలయం

ఆయిల్‌పామ్ రైతులకు దసరా కానుక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పక్కన రైతు ప్రతినిధులు

- 12న అశ్వారావుపేట ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ ప్రారంభం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: ఈ ఏడాది విజయదశమి పర్వదినం ఆయిల్‌పామ్ రైతుల్లో వెలుగులు నింపనుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ అత్యధిక శాతం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సాగవుతోందని.. ఇప్పటికే దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ ఉందని తెలిపారు. ప్రస్తుతం అశ్వారావుపేట ఫ్యాక్టరీలోనూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రూ.32 కోట్ల వ్యయంతో 2.5 మెగావాట్ల సామర్థ్యంతో పవర్ ప్లాంట్ నిర్మించామన్నారు. ఈ ఫ్యాక్టరీని ఈ నెల 12న విజయదశమి సందర్భంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో రెండు రాష్ట్రాల రైతులు, పలు కంపెనీల ప్రతినిధులు, ఆయిల్‌పామ్ శాస్త్రవేత్తలు పాల్గొంటారని వెల్లడించారు. ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఆలపాటి రామచంద్రప్రసాద్, నాయకులు తుమ్మ రాంబాబు, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జేష్ట సత్యనారాయణచౌదరి, వేముల భారతి, కొయ్యల అచ్యుతరావు, సోయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భారీగా తరలిరావాలి

ములకలపల్లి: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ఈనెల 12న పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నందున రైతులు భారీగా తరలిరావాలని ఆయిల్‌పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ కోరారు. ములకలపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ సాగుపై అవగాహన కోసం వ్యవసాయ శాస్త్రవేత్తలతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేదాసి వెంకట సత్యనారాయణ, పర్వతనేని అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, చిలకపాటి జైచందర్‌రావు, మేకల పెద్దవెంకన్న, నల్లమోతు జగదీశ్, బాల అప్పారావు, బింగి శేషగిరి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ !


మార్కెట్‌లో నిర్మాణాల నమూనా

- మోడల్ మార్కెట్ నిర్మాణానికి రూ.155.30 కోట్లు
- ఏడు షెడ్లు, కోల్డ్ స్టోరేజీతో నిర్మాణం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోనే రెండో పెద్దదైన మార్కెట్‌ను దేశంలో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని ఖమ్మం నియోజకవర్గం నుంచి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మిర్చి యార్డుల స్థానంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం దసరా వేళ ఆమోదించడమే కాక రూ.155.30కోట్లు మంజూరు చేసింది.

ఏ ఇబ్బంది లేకుండా...

ఖమ్మం మార్కెట్‌లో పరిస్థితులను అధ్యయనం చేసిన మార్కెటింగ్ శాఖ ఆర్కిటెక్ట్ బృందం ప్రస్తుతం ఉన్న 15.39 ఎకరాల విస్తీర్ణంలోనే అధునాతనంగా మోడల్ మార్కెట్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించింది. 1.50 లక్షల నుంచి 2లక్షల మిర్చి బస్తాలు వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడు షెడ్లతో కూడిన మార్కెట్‌తో పాటు కోల్డ్ స్టోరేజీ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం మిర్చికి అన్‌సీజన్ కావటంతో పనులు మొదలుపెడితే సీజన్ మొదలయ్యే నాటికి మూడు నుంచి నాలుగు షెడ్ల నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు.

విదేశాలకు ఎగుమతి

దేశ, విదేశాలకు ఎగుమతి చేసే మిర్చి క్రయవిక్రయాలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం నుంచే కాక మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు మిర్చి పంటను ఇక్కడకు తీసుకొస్తారు. ఈ ప్రాంతంలో పండించే 'తేజా' రకం మిర్చి చైనా, బంగ్లాదేశ్, థాయిల్యాండ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి అవుతుంది. డిమాండ్ ఆధారంగా నానాటికీ పంట సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో ఏటా ఖమ్మం మార్కెట్‌కు వచ్చే మిర్చి కూడా అదే స్థాయిలో ఉంటోంది. ప్రస్తుతం ఉన్న యార్డుల్లో సుమారు 60వేల నుంచి 70 వేల బస్తాల వరకే నిల్వ చేసే అవకాశముంది. సీజన్‌లో ఇంతకు మించి మిర్చి వస్తే రహదారుల వెంట బస్తాలను దింపి విక్రయించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కోట మైసమ్మ జాతరలో భారీ పోలీసు బందోబస్తు


జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కారేపల్లి: ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరిగే జాతరకు 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు అదనపు డీసీపీ ప్రసాదరావు తెలిపారు. జాతర ప్రాంగణాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డితో కలిసి డీసీపీ బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఐదురోజుల పాటు జరిగే జాతరలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలతో పాటు 120 మంది పోలీసులతో దశలవారీగా బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భారీ, చిన్న తరహా వాహనాలకు వేర్వేరు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. అలాగే, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందని తెలిపారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం పాల్గొన్నారు.